క్లుప్తంగా

రైతు ఆత్మహత్యపై విచారణ



బాలాపురంలో విచారణ చేస్తున్న తహసీల్దార్ శేషారెడ్డి

పుట్లూరు: మండలంలోని బాలాపురానికి చెందిన రైతు రామాంజులరెడ్డి అప్పుల బాధతో గత నెల ఆత్మహత్య చేసుకోగా గురువారం తహసీల్దార్ శేషారెడ్డి, ఇతర మండల అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. వ్యవసాయంలో నష్టం రావడంతో దాదాపు రూ.15 లక్షలు అప్పులు చేసి, వాటిని తిరిగి చెల్లించలేని పరిస్థితి ఏర్పడటంతో రైతు రామాంజులరెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి కాత్యాయణి, రెవిన్యూ అధికారులు ఉన్నారు.

'చార్టర్డ్ అకౌంటెన్స్'తో బంగారు భవిష్యత్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సి.ఎ. వెంకటనారాయణ

గుంతకల్లుటౌన్: ఇంటర్మీడియట్ తరువాత సి.ఎ. (చార్టర్డ్ అకౌంటెన్స్) చదవడం వల్ల విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు వెంకట నారాయణ, ఫణికుమార్ సూచించారు. ఆదాయపు పన్ను దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీశంకరానంద ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' ఆధ్వర్యంలో సి.ఎ. ప్రయోజనాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సి.ఎ. పూర్తి చేసిన తరువాత అకౌంటింగ్, ఫైనాన్స్, ఆడిటింగ్, ట్యాక్సేషన్ రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కెసి.హరి, ప్రిన్సిపల్ వరప్రసాద్, సి.ఎ. రాకేష్ గుప్త, ట్యాక్స్ కన్సల్టెన్సీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డీపీఓ ఆకస్మిక తనిఖీ



ఎద్దులపల్లిలో చెత్తసంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి పంచాయతీ గ్రామాన్ని గురువారం డీపీఓ నాగరాజు నాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులపై ప్రజలతో సమీక్షించారు. రోజూ ఉదయం 7గంటలకే ఇంటింటికీ వెళ్లి పొడి, తడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రంలో వేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే సకాలంలో వాటర్ ట్యాంకులను శుభ్రపర్చాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. దాని నిర్వహణపై సిబ్బందితో సమీక్షించారు. ఆయన వెంట ఎంపీడీఓ కే తేజ్యోత్స్న, జీ వీరాంజనేయులు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



రాయలచెరువులో అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు

యాడికి: మండలంలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డెంగీ నివారణ మాసోత్సవంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు అప్పయ్య, దేవరాజన్, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాయలచెరువు గ్రామంలో ఉన్నత పాఠశాల వద్ద ఉన్న కాలనీలో మురికి నీటిని, చెత్తా చెదారం తొలగింపుపనులు చేపట్టారు. వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో దోమల నివారణకు డ్రైడే ఫ్రైడే పాటించడం, దోమతెరలు వాడటం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ షబ్బీర్ బాషా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు: మండలంలోని దిమ్మగుడి చౌడమ్మతల్లి ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గత కొద్ది రోజులు గా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వారి నుంచి రూ..20,600 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో జమీందారులు నబీరసూల్, ఓబుళపతి, కానిస్టేబుల్ శేషావలి తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రి పట్టణం క్రిష్ణాపురంలో ఓ రోడ్డులో నిలిచిన మురుగు



ఓ ఇంట్లో నిలిచిన మురుగునీరు

మురుగుతో సావాసం

తాడిపత్రిటౌన్: పట్టణంలో అండర్‌డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా మారడంతో మురుగు సమస్యలు నెలకొన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలలు తరబడి రోడ్లపై మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతుండటంతో ఇళ్లల్లో వుండలేక పోతున్నామని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కారణంగా పట్టణంలో దోమల వ్యాప్తితో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. చీకటి పడితే కనీసం ఇంటి బయట నిలుచుకునే అవకాశం లేకుండా దోమలు దండయాత్ర చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని క్రిష్ణాపురం నాలుగో వీధిలో ఏకంగా మురుగు నీరు ఇళ్లల్లోకి ప్రవహిస్తుండటంతో నాలుగు నెలలుగా మురుగు నీటితోనే సహవాసం చేస్తున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై మురుగు నీరు నిలిచి పాచి పట్టి దుర్వాసన వెదజల్లుతుండడంతో బయటకు రావడానికే కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఇళ్లల్లోకి మురుగునీరు వెళ్లడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. మురుగునీరు తొక్కుకుంటూ ఇంట్లోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్నిసార్లు అధికారులు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రజాప్రతినిధులు , అధికారులు కాలనీలో పర్యటించి పరిస్థితి చూడాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు. దుర్వాసన కారణంగా రాత్రి సమయంలో ఇంట్లో నిద్రపోలేక పోతున్నామన్నారు. మురుగు కంపుకు ఇంట్లో కనీసం భోజనం చేయలేని పరిస్థితి ఉందని వాపోయారు. సంబందిత అధికారులు స్పందించి పట్టణంలో మురుగు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులకు ఆటవిడుపు కరువు



గుంతకల్లులోని చిల్డ్రన్స్ పార్కులో పనికిరాకుండా పోయిన ఆట పరికరాలు

గుంతకల్లు: పట్టణంలోని ప్రభాత్‌నగర్‌లో కోసగి గెస్ట్ హౌస్ వెనుక నిర్మించిన చిల్డ్రన్స్ పార్కు దుస్థితికి చేరి చిన్నారులకు ఆటవిడుపు కరువైంది. పిల్లలు ఆడుకోవడానికి, రైల్వే కుటుంబాలు సేదతీరడానికి రైల్వే అధికారులు లక్షాలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ఈ పార్కును ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆహ్లాదకరంగా ఉండాల్సిన పార్కులో ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. అంతే కాకుండా పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు పనికి రాకుండాపోయాయి. అధికారులు స్పందించి పార్కును వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్రం జాషువాకు నివాళి

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో గురువారం నవయుగ కవి గుర్రం జాషువా 54వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అబూవర్కర్, స్వర్ణాంబ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జాషువా అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెన్షన్ల అసోషియేషన్ అదనపు కార్యదర్శి కుళ్లాయి బాబు, వెంకటేస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి రోజాను విమర్శించడం తగదు



మాట్లాడుతున్న చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్‌పర్సన్ వరలక్ష్మి, ఎంపీపీ విశాలాక్షి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి

గుత్తి: టీడీపీ ఎమ్మెల్యే భాను ప్రకాష్ మాజీ మంత్రి రోజాను విమర్శించి వ్యక్తిత్వ హననానికి పాల్పడం దారుణమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతి రెడ్డి మండిపడ్డారు. గుత్తిలోని ఆర్అండ్ బీ బంగ్లాలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి రోజాపై ఎమ్మెల్యే భాను ప్రకాష్ వ్యక్తిగత విమర్శలు చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. పాలనను గాలికొదిలేసి కూటమి నాయకులు ప్రతిపక్ష నాయకులపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ కూటమి నాయకులు ప్రవర్తనను గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాలన గురించి పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం ప్రతి పక్ష వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను విమర్శించడం, అక్రమ కేసులు పెట్టడం పరిపాటిగా మారిపోయిందన్నారు. ఇక కూటమి నాయకుల ఆటలు సాగవన్నారు.

అంతకుముందు ఆర్అండ్ బీ బంగ్లాలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాళ్లు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైస్ చైర్ పర్సన్ బిందె వరలక్ష్మి, ఎంపీపీ విశాలాక్షి, కౌన్సిలర్ మర్తాడు హసీనా, మాజీ పట్టణ కన్వీనర్ శ్రీదేవి తదితరులు మాట్లాడారు. మంత్రి అచ్చెన్నాయుడు ఆడ బిడ్డ నిధి పథకం అమలు విషయంలో మహిళలను కించపరిచేలా మాట్లాడాడన్నారు. వెంటనే అచ్చెన్న తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. పాలనను గాలికొదిలేసి వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్టులు చేస్తూ రాజకీయం పబ్బం గడుపుకుంటున్నారన్నారు. త్వరలోనే ప్రజా కోర్టులో కూటమి నాయకులకు శిక్ష పడుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కోనా మురళి ధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్ యాదవ్, గంగరాజు, వాణిజ్య విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి సీవీ రంగా రెడ్డి, జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్ యాదవ్,మాజీ కన్వీనర్లు పీరా, శ్రీదేవి, డాక్టర్ శాంతి ప్రియ, పట్టణ మహిళా విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులు హేమలత, లావణ్య, మహిళా నాయకురాళ్లు భాగ్య, పద్మ, నారాయణమ్మ, పట్టణ ప్రచార అధ్యక్షులు వెల్డింగ్ రవూఫ్, సీనియర్ నాయకులు కటిక అన్వర్, మర్తాడు దాదు, మర్తాడు అన్సార్, షఫి, రమేష్ రెడ్డి, జీపు రమణ, తోళ్ల షాపు హరి, పవన్, హరినాథ్‌రెడ్డి, మల్లి, కౌన్సిలర్లు వాల్మీకి శివ, ఫరూక్, కేవీ రమణ, వరదరాజులు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుత్తి రూరల్: ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రోజూ నాణ్యమైన భోజనం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని రజాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఏఐఎస్ఎఫ్ నాయకులు భోజనం చేసి రుచి చూశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కాస్మొటిక్ చార్జీలు, ట్రంకు పెట్టెలు, డ్రస్సులు క్రమం తప్పకుండా మంజూరు చేయాలన్నారు. గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మను, ప్రకాష్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

గుత్తి: పట్టణంలోని విరూపాక్షి రెడ్డి ఫంక్షన్ హాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన శంకర్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించారు. సుమారు 100 మంది రోగులు హాజరు కాగా ఇందులో 40 మందిని కంటి ఆపరేషన్ల కోసం బెంగుళూరుకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి విరూపాక్షి రెడ్డి, రిలయన్స్ బాషా, చిన్ని, శ్రీకరం రవి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన మోసపూరితం



బీకేఎస్ మండలం ఓబుళాపురంలో మాట్లాడుతున్న గువ్వల శ్రీకాంత్‌రెడ్డి



పుట్లూరు మండలం రంగరాజుకుంటలో క్యూఆర్ కోడ్‌పై ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లిలో అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుక్కరాయసముద్రం: చంద్రబాబు ఏడాది పాలన అంతా మోసపూరితమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ నియోజక వర్గం సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజానాథ్ పిలుపు మేరకు గురువారం మండలంలోని ఓబులాపురం, దండువారిపల్లి, ఏడావులపర్తి గ్రామాల్లో ఇంటింటికీ చంద్రబాబు మోసం–మోసపూరిత హామీలు రీకాలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు ప్రజలకు ఓట్లు వేయాలని మోసపూరిత హామీలిచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. చంద్రబాబు మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అనంతరం టీడీపీ మేనిఫెస్టోలోని అవాస్తవాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, చికెన్ నారాయణస్వామి, నరేష్, బయపరెడ్డి, మహానందరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మంత్రి అంజినేయులు, నాగ, సాకే లక్ష్మి నారాయణ, నాగరాజు, పెద్దిరెడ్డి, రవి, శేఖర్‌రెడ్డి, మనీష్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరు

పుట్లూరు: అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను భయపెట్టాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని, వారి కేసులకు ఏ ఒక్కరూ భయపడరని ఆ పార్టీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రంగరాజుకుంట, రంగమనాయునిపల్లి, కొండుగారికుంట, తురకవారిపల్లి, కుమ్మనమల గ్రామాల్లో 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ పథకాలకు అర్హులందరికీ అందాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చేపడుతూ రాక్షస పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రమణాయాదవ్, నాయకులు సూర్యనారాయణరెడ్డి, రామాంజులరెడ్డి, గరికపాటి నారాయణ స్వామి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కేశవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగేష్, రాజు, రామక్రిష్ణ, మారుతి, పవన్, సుధాకర్‌రెడ్డి తదితులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని లక్ష్మంపల్లి గ్రామాల్లో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై ప్రజలకు వైఎసస్సార్‌సీపీ నాయకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి 'రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

గార్లదిన్నె: శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి గ్రామాల్లో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 25వ తేదీ కల్లూరు, ఇల్లూరు, ఎగువపల్లి, 26న ముంటిమడుగు కొత్తపల్లి, కొత్తూరు, రామదాసు పేట,అంకంపేట 27న గుడ్డాలపల్లి, శిరివరం, 28న క్రిష్ణాపురం, బూదేడు, సంజీవపురం , 29న కొప్పల కొండ, కేశవాపురం, కమలాపురం, కొట్టాలపల్లి, 30న జంబులదిన్నె,తలగాచిపల్లి, పాపి నేపాళ్యం, ఆగసస్టు 1న పెనకచెర్ల డ్యాం, పెనకచెర్ల, పి.కొత్తపల్లి, ముకుందాపురం , 2న యర్రగుంట్ల, 3న మర్తాడు, కోటంక, కనంపల్లి, తిమ్మంపేట గ్రామాల్లో రీకాలింగ్ కార్య క్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలకు ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరై జయప్రదం చేయాలన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలి



రిలేదీక్షలు చేస్తున్న దృశ్యం

పామిడి: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలంటూ పామిడిలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో వంద గంటల రిలే నిరాహార దీక్షలు గురువారం 11వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంక రాజుకాలువ వెంకటేష్‌తో పాటు లక్ష్మయ్య, కేశవ, సుధీర్, సుదర్శన్, ఓబుళపతి రిలే దీక్ష చేపట్టారు. దీక్షకు సీపీఐ(ఎంఎల్) నాయకులు, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పీ చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి గజ్జల దస్తగిరి, పక్కీరప్ప, నూర్‌భాష, ఓబుళయ్య, నారాయణస్వామి సంఘీభావం తెలిపారు.

మట్కా బీటర్ అరెస్ట్

తాడిపత్రిటౌన్: మండలంలోని సజ్జలదిన్నె గ్రామంలో మట్కా బీటర్ నూర్‌బాషాను సీఐ శివగంగాధర్‌రెడ్డి అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ 20వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

31 లోపు పంటల బీమా చేసుకోవాలి

గార్లదిన్నె: రైతులు ఈనెల 31లోపు పంటల బీమా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు.గురువారం ఏఓ మాట్లాడుతూ పత్తి, వేరుశనగ, దానిమ్మ, బత్తాయి, టమోటా, అరటి పంటలు వాతా వరణ ఆధారిత పంటలు కిందకు వస్తాయన్నారు.అలాగే కంది, ఎర్ర మిరప, జొన్న, మొక్కజొన్న, వరి,పంటలు ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో వర్తిస్తాయన్నారు. అనంతరం జాతీయ ఆహార భద్రత పథకం కింద ఎల్ఆర్‌జీ 105 కంది రకం రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసుల రెడ్డి, మండల కన్వీనర్ పాండు, రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: రైతులు సాగు చేసిన పంటలకు ఈ నెల 31లోగా బీమా చేయించుకోవాలని ఏఓ మహబూబ్ బాషా తెలిపారు. గురువారం స్థానిక సంత మార్కెట్‌లో ఉన్న రైతు సేవా కేంద్రంలో ఏఓ రైతులతో సమావేశమై మాట్లాడారు. రైతులు మీ సేవ కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్లో పంటల బీమా చేయడానికి ప్రీమియం చెల్లించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న కెమిస్ట్రీ, ఫిజిక్సు అతిథి అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ గురవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెలకు రూ.27వేల వేతనం ఇస్తామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'పీఎం సూర్య ఘర్'సద్వినియోగం చేసుకోండి

శింగనమల: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మె ల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. గురువారం శింగనమలలో ఎల్విన్ ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడానికి పీఎం సూర్యఘర్ యోజన పథకం ప్రారంభించారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ పలకలు ఏర్పాటు చేస్తారన్నారు. ఎల్విన్ ఎనర్జీ సంస్థ ఎండీ విజయభాస్కర్, ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ కేశవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు



తాడిపత్రిరూరల్: అమ్మవారు



శింగనమల: చౌడేశ్వరీదేవి



పామిడి మండలం పీ కొండాపురంలో..



పుట్లూరులో చౌడేశ్వరీ అమ్మవారు

తాడిపత్రి రూరల్/శింగనమల/పెద్దవడుగూరు/పామిడి/పుట్లూరు/యాడికి: తాడిపత్రి పట్టణంలో గురువారం చౌడేశ్వరీమాత జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని యల్లనూరు రోడ్డు, నవరంగ్ టాకీస్ రోడ్డు, చేనేత కాలనీతోపాటు పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవారిని అర్చకులు పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయాలను వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. వివిధ అలంకరణలతో దర్శనమిచ్చిన అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే శింగనమలలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో గురువారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా పెద్దవడుగూరు మండలంలోని క్రిష్టిపాడు, పెద్దవడుగూరు, మేడిమాకులపల్లి తదితర గ్రామాల్లో గురువారం చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి బోనాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అలాగే పామిడి మండలంలోని పీ కొండాపురం, కాలాపురం, ఎద్దులపల్లి తదితర గ్రామాల్లో చౌడేశ్వరి అమ్మవారి జయంతీ వేడుకలను నిర్వహించారు. అలాగే పుట్లూరు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో చౌడేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలు చేపట్టారు. అదేవిధంగా యాడికి మండల కేంద్రంలోని సంతమార్కెట్ వీధిలో ఉన్న చౌడేశ్వరీ దేవి ఆలయంలో గురువారం చౌడేశ్వరీ దేవి జయంతి వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బొంబాయి ఉమాదేవి రమేష్ నాయుడు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో ఉన్న చౌడేశ్వరీ ఆలయాల వద్దకు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చి టెంకాయలు సమర్పించి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎంపీడీఓ వీర్రాజు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ కాశెప్ప, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ ఆలయం వద్దకు వచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు.



యాడికిలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, రమేష్ నాయుడు



పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లిలో చౌడేశ్వరీదేవికి పూజలు చేస్తున్న భక్తులు



పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడులో చౌడేశ్వరీదేవికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు